క్లుప్తంగా

26న మండల సమావేశం

రాయచోటి : రాయచోటి రూరల్ మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ వల్లపు రాజమ్మ మంగళవారం రాయచోటిలో పత్రికలకు అందజేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటిలోని మండల ప్రజాపరిషత్ సభా భవనంలో మండల పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పరిధిలోని అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

26 నుంచి జీవాలకు నట్టల నివారణ మందు

సిద్దవటం : మండలంలోని మేకలు, గొర్రెలు (జీవాలకు) ఈనెల 26వ తేదీ నుంచి జూలై 10వ తేదీ వరకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు భాకరాపేట పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా సిద్దవటం మండలం భాకరాపేట పశువుల ఆసుపత్రిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉండేందుకు నట్టల నివారణ మందులను తాపుతారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తకు నివాళి



కార్యకర్త మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

సుండుపల్లె : మండల పరిధిలోని మాచిరెడ్డిగారి పల్లె గ్రామ పంచాయతీ చిన్నబిడికి గ్రామంలో వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్త సుబ్బరాంనాయక్ సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి వైఎస్‌ఆర్‌సీపీ అండగా ఉంటుందని ఆకేపాటి భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆరంరెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్, గిరిజన విభాగం అధ్యక్షుడు చంద్రానాయక్, ముదుపు రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస గ్రామ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ యామిని రెడ్డిని మంగళవారం గ్రామస్తులు కోరారు. మంగంపేట పునరావాసం, పరిహారం, భూములు తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రైతులు, గ్రామస్తులు కోరారు. తహసీల్దార్ స్పందించి తప్పకుండా మంగంపేట సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుల పత్తూరి రామసుబ్బారెడ్డి, పులపత్తూరి సుదర్శన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి రాయుడు, పోతల లక్ష్మీనారాయణ, గ్రామాల రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చిట్వేలి : అర్హత కల్గిన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ సుధాకర్ తెలియజేశారు. మంగళవారం మండలంలోని నేతివారిపల్లి, పెద్దూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతివారిపల్లిలో బొప్పాయి తోటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బొప్పాయిలో సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి రైతు సూక్ష్మపోషకాలను వాడాలన్నారు. రైతుల భూసార పరీక్షల ఆధారంగా రసాయనాలను వాడాలని ఏఓ సుధాకర్ సూచించారు. ప్రతి రైతుకు పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ తెలియజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ వెంకటాద్రి, కల్యాణ్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

27 నుంచి క్రికెట్ టోర్నమెంట్

నందలూరు : మండలంలోని అరవపల్లి యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కరీముల్లాఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాలు, ఆపై మంటపంపల్లి, గుంటికాడపల్లె, చింతరాజుపల్లి, మందపల్లి, ఆకేపాడు, గుండ్లూరు, హస్తవరం, బోయినపల్లి, తాళ్లపాక గ్రామాలకు వారు టోర్నీ ఆడటానికి అర్హులన్నారు. నందలూరులో పని చేసే రైల్వే ఎంప్లాయీస్, ప్రభుత్వ ఉద్యోగులు ఆడవచ్చని అని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.30 వేలు జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్, రెండవ బహుమతి రూ.20 వేలు ఒరికాల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్రూప్ బెంగళూరు వారు అందించనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.1200లను ఈ నెల 26వ తేదీలోపు చెల్లించాలన్నారు. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిని ట్రస్టు సభ్యులు ఆహ్వానించారు.

బొప్పాయి.. బాబోయ్!

బొప్పాయి రైతులకు కష్టాలు తప్పడం లేదు. గత రెండేళ్లుగా బొప్పాయి సాగు చేసిన రైతులను అటు ప్రకృతి ఇటు దళారుల చేతిలో మోసపోతూ దెబ్బతింటున్నారు. ఈ ఏడాదీ అయినా లాభాలు చూడొచ్చు అనుకున్నా రైతాంగానికి నిరాశే మిగిలేలా పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం పంటకు పిందె పట్టకుండా పోవడంతో రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఏడాది లాభాలు చూడకుంటే అప్పుల ఊబిలో పడాల్సిందేనన్న ఆవేదనను వెలిబుచ్చుతున్నారు. బొప్పాయి సాగు చేస్తున్న కోడూరు నియోజకవర్గ రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలపై కథనం.

- పూత కనబడక నిరాశలో రైతాంగం
- రెండేళ్లుగా ధరలు లేక దిగాలు
- దళారుల బెడదతో మరింత నష్టపోతున్న వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు



కాయలు రాని బొప్పాయి పంట

రైల్వేకోడూరు అర్బన్ : బొప్పాయి పంటను సాగుచేసే రైతులకు బహుముఖ ప్రయోజనాలు ఉండటంతో అధిక లాభాలు వస్తాయని రైల్వేకోడూరు ప్రాంత రైతులు ఈ ఏడాది పెద్దఎత్తున సాగు చేశారు. పంటకు వైరస్ సోకకుండా ఉంటే వాతావరణం, వర్షాలు అధికమించి అధిక దిగుబడి వస్తే రైతులకు సిరులు కురిపిస్తాయి. కానీ గత ఏడాదిగా అన్ని రకాల పంటలు నష్టాల పాలై అప్పుల ఊబిలో ఉన్న రైతులుకు సాగు చేసిన బొప్పాయి పంట పూత పిందె రాకుండా రైతులను నట్టేట ముంచింది. దీంతో రూ.లక్షలలో పెట్టుబడి పెట్టిన రైతులు ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. గత రెండేళ్లుగా పంటలు బాగా వచ్చినా దళారుల మోసాలతో ప్రతి ఏడాదీ రైతులు ఆర్థికంగా నష్టపోయారు. అటు ధరలు ఉన్నా పంట చేతికి రాకపోగా, ఎక్కువ శాతం పిందే పడకుండా బొప్పాయి పంట రైతులకు కునుకు లేకుండా చేస్తోంది.

నియోజకవర్గంలో వేల ఎకరాల్లో..

రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని కోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాలలో సుమారు 20 వేల ఎకరాలకు పైగా బొప్పాయి పంటను రైతులు అప్పులు చేసి పండిస్తున్నారు. రైతులకు బొప్పాయి పంట మొదటి రెండు కోతల్లో లాభాలు వస్తాయి. అలాగే మూడవ సారి పంటను బొప్పాయి పాలకు, టూటీ – ఫ్రూటీ తయారీకి ఉపయోగించే బొప్పాయి ఫ్యాక్టరీలకు ఎగుమతి చేయవచ్చు. రైతులకు బొప్పాయి పంటపై మూడు దశల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా, సాగు చేసిన బొప్పాయి చెట్లకు కాయలు లేకపోవడం రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్దో గొప్పో ఉన్న బొప్పాయి పంటను రైతులు తెగుళ్ల నుంచి కాపాడుకుంటే రైతులకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రతి యేటా రూ.8 వేల నుంచి రూ.20 వేల వరకు టన్ను కాయలు ధరలు పలుకుతుండేవి, అయితే గత యేడాది ఈ ఏడాది బొప్పాయి ధరలు ఆశించనంతగా లేవు పంట దిగుబడి తగ్గింది. కేవలం టన్ను రూ.5 వేల నంచి రూ.8 వేల వరకు మాత్రమే పలుకుతోంది. గత ఏడాది చివరలో అధిక ధరలు పలకడంతో ఈ ఏడాది చాలా మంది రైతులు బొప్పాయిపై కోటి ఆశలతో సాగు చేశారు. బొప్పాయి సాగు ఎకరాకు రూ.40వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చు అవుతుంది. బొప్పాయి కాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడమే కాక స్థానికంగా ఉండే బొప్పాయి కర్మాగారాలకు కాయలు తరలిస్తుంటారు. రైతులు బొప్పాయి పంటను నాటిన దగ్గర నుంచి చివరి దశ వరకు కాపాడుకోగలిగితే నష్టపోకుండా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

బొప్పాయి పంట ఎకరాలలో..	
మండలం	బొప్పాయి పంట
కోడూరు	14000
ఓబులవారిపల్లి	2462
చిట్వేలి	1890
పుల్లంపేట	650
పెనగలూరు	315

మొలకలపై సబ్సిడీ ఇవ్వాలి



బొప్పాయి పంటను పండించే రైతులకు మొలకలను ప్రభుత్వం సబ్సిడీ కింద అందించాలి. దీనివల్ల పెట్టుబడి తగ్గుతుంది. ఈ ప్రాంతంలో బొప్పాయిని అధికంగా పండిస్తుంటారు. ప్రత్యేకంగా ఈ పంట వేసే రైతులకు పంటసాగుపై అవగాహన కల్పించాలి. గిట్టుబాటు ధర లేని సమయాల్లో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి, రైల్వేకోడూరు మండలం

ధరలు పెరిగినా లాభం రావడంలేదు



బొప్పాయి పంటలు గత ఏడాది పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది బొప్పాయి పంటకు ధర బాగా ఉంటుందని ఆశతో సాగు చేస్తున్నాను. రెండు సంవత్సరాలు నష్టాలు వస్తే ఒక్క సంవత్సరం మాత్రమే లాభాలు వస్తున్నాయి. కానీ ఈ ఏడాది కాయలు రావడం లేదు. ఆ లాభాలు కూడా పెరిగిన ధరలా కాకుండా సాధారణంగా ఇస్తున్నారు.

– మల్లు సుధాకర్‌రెడ్డి, రైతు, రాఘవరాజపురం, రైల్వేకోడూరు

దళారులతో తీరని నష్టం



పెరిగిన పెట్టుబడులతో బొప్పాయి పంట ఎంత నాణ్యంగా పండించినా చివరకు దళారుల దెబ్బకు అప్పులే మిగులుతున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోంటే ధరలు తగ్గినా పెట్టుబడులన్నా మిగులుతాయి. అలానే ఈ ప్రాంతంలో బొప్పాయి అనుబంధ పరిశ్రమను ప్రభుత్వం నెలకొల్పి రైతులకు న్యాయం చేయాలి.

– ఎం.సుబ్బరామరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైల్వేకోడూరు

నాటే దశ నుంచి సస్యరక్షణ పాటించాలి



రైతులు బొప్పాయి మొక్కలు నాటే సమయంలో సస్యరక్షణ చర్యలు పాటించాలి. మొలకలు నాటాక తెల్లదోమ, రసం పీల్చు పురుగుల నుంచి కాపాడుకోవడానికి మందులు పిచికారీ చేయాలి. చెట్ల పెరుగుదలకు మైక్రోన్యూట్రిన్స్ అందించాలి. ఎరువులు క్రమబద్ధంగా అందించాలి. రైతులకు అనుమానం ఉంటే వెంటనే అధికారులను సంప్రదించాలి.

– వెంకటభాస్కర్, ఉద్యాన శాఖఅధికారి, రైల్వేకోడూరు

విద్యతో పాటు విలువలు పెంపొందించుకోవాలి

రాజంపేట రూరల్ : విద్యార్థులు పిన్న వయసు నుంచే విద్యతో పాటు విలువలు పెంపొందించుకోవాలని విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మందరం కొత్త ఇండ్లలోని ప్రాథమిక పాఠశాలలో గల విద్యార్థులకు మంగళవారం విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతుగుంట మాట్లాడుతూ విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా గత 19 సంవత్సరాల నుంచి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి షేక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షులు పట్టుపోగుల ఆదినారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన నాగారపమ్మ మూడో వారం జాతర



సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాదిగా పాల్గొన్న భక్తులు

సుండుపల్లె : మండల పరిధిలోని బండకాడ ఈడిగ పల్లె గ్రామంలో వెలసిన నాగారపమ్మ మూడో వారం జాతరను అన్నమయ్య జిల్లా డీజే ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసుకుని, రాత్రి సమయంలో చాందినీబండ్లు ఏర్పాటు చేసి జబర్దస్త్ టీం వారిచే ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని నిర్వహించి అంగరంగ వైభవంగా జాతర మహోత్సవాన్ని జరిపారు. జిల్లాలోని నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, సాంస్కృతిక కార్యక్రమాలను చూసి తిలకించారు.

సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా పనిచేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

వీరబల్లి : మండలంలోని ప్రజల సమస్యలను తీర్చుటకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో ఏర్పడిన నీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఉచిత ఇసుక పేరుతో మండల కేంద్రం వద్దనున్న మాండవ్య నది నుంచి కూటమి ప్రభుత్వ కార్యకర్తలు, నాయకులు నిబంధనలకు విరుద్ధంగా రాత్రింబవుళ్లు ఇసుకను తరలిస్తున్నారని, దీంతో మండల కేంద్రంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు కూడా నీటి సమస్య ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వంలో కనీసం ప్రజలకు చుక్క నీరు దొరికేటట్లు లేదన్నారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలైందని, అయినప్పటికీ రైతుల అవసరం మేరకు వర్షం కురవలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ కాలంలో రైతులకు సకాలంలో రైతు భరోసా అందకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాక అమ్మఒడి చాలా మంది తల్లుల ఖాతాల్లో జమకాక సచివాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కోరారు. రైతులకు వేరుశనగ విత్తనకాయలను అరకొరగా మంజూరు చేసి ఎర్ర విత్తనాలు మాత్రమే ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు తన భూమి సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రీ సర్వే పేరుతో రెవెన్యూ వారు నిర్వహిస్తున్న సర్వేను సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. అధికారులు మారుతున్నా, పాలకులు మారుతున్నా భూముల విషయంలో రైతుల సమస్యలు తీరలేదని, ఇప్పటికైనా మండలంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్ బాబు, ఎంఆర్‌ఓ, మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీమా చట్టాల సవరణపై పునరాలోచించాలి

రాజంపేట టౌన్ : బీమా చట్టాల సవరణ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం రాజంపేట బ్రాంచ్ కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం రాజంపేట బ్రాంచ్ అధ్యక్షుడు పి.సుభాష్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎల్‌ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమాన్ని మరోమారు చేపట్టనుందని, దీనికి తాము వ్యతిరేకమని తెలిపారు. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 3, 4 తరగతి ఉద్యోగుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు కొత్త పెన్షన్ విధానానికి స్వస్తిపలికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధపడుతున్నాయన్నారు. ఎల్‌ఐసీలో అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘటితంగా పోరాడినప్పుడే సమస్యలు పరిష్కారం కాగలవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాష్, చంద్రమోహన్‌రెడ్డి, గంగాధర్, రాఘవేంద్ర, రామ్‌ప్రసాద్, ఎస్ఎం.బాషా, రాజశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, లక్ష్మీనారాయణ, భాస్కర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలన మోసాలమయం

రాయచోటి జగదాంబసెంటర్ : ఎన్నికల ముందు ప్రజలకు హామీలతో మాయ చూపించి అధికారంలోకి వచ్చాక వాటిని పక్కన పెట్టడం కూటమి ప్రభుత్వానికి అలవాటైపోయిందని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ ఆరోపించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఏడాది పాలనలోనే తాము సుపరిపాలన అందించామని చెప్పుకోవడం ప్రజలను మోసగించే ప్రయత్నమేనని ధ్వజమెత్తారు. జిల్లాలో ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. పంటలకు కనీస మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతుంటే ప్రభుత్వం కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలలో ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని వాపోయారు. ప్రజల జీవితాలతో ఆడుకునేలా వ్యవహరిస్తున్న ఈ పాలనను సుపరిపాలన అనడం అవమానకరంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు 2-డీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నందలూరు : మండల కేంద్రంలోని డాక్టర్ పీవీ నరసింహారావు వైద్యశాలలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. కడప శ్రీ శ్రీనివాస హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బైన శ్రీనివాసరావు(యూరాలజీ) డాక్టర్ అంపాబత్తిన గౌరి(కార్డియాలజీ) వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. నందలూరు పట్టణ ప్రాంత ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత మెడికల్ క్యాంపును విజయవంతం చేశారు. ఈ ఉచిత క్యాంపులో వంద మందికి పైగా రోగులు హాజరుకావడం విశేషం. రోగులందరికీ డాక్టర్ పృథ్వీ ఓపీతో పాటు ఈసీజీ, 2–డీ ఎకో వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పాత పద్ధతిలోనే పెన్షన్‌లు ఇవ్వాలి

రాయచోటి టౌన్ : పాత పద్ధతిలోనే రిటైర్డ్ పెన్షన్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా శాఖ అధ్యక్షులు ఆర్.రాజగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆల్ ఇండియా స్టేట్ పెన్షన్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం వినతి పత్రాన్ని జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ మధుసూధన్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పాత పద్ధతిలో పెన్షన్లు ఇస్తుండగా భారత ప్రభుత్వం మాత్రం దానిని సవరణ చేసి పాత పెన్షన్ పద్ధతి, డీఏలు తొలగించి, కేవలం పదవీ విరమణ చేసే సమయంలో నిర్ణయించే పెన్షన్, డీఏ మాత్రమే ఇచ్చే విధంగా బిల్లు తీసుకొచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తుండటం దుర్మార్గమన్నారు. పాత పద్ధతిలోనే పెన్షన్‌లు కొనసాగించి రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయవల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య, రాష్ట్ర శాఖ కార్యదర్శి సురేంద్రారెడ్డి, రాయచోటి కన్వీనర్ సిఆర్‌వి సుబ్రహ్మణ్యం, సభ్యులు కె.కృష్ణమూర్తి, రాజగోపాల్, రామమూర్తి నాయుడు, వెంకట రమణ, ఆంజనేయులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు మేరకు భూ ఆక్రమణపై సర్వే

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని మారెమ్మ ఆలయం వద్ద ఉన్న సర్వే నెంబర్. 1509లోని 98 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ అయ్యిందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల రెవెన్యూ అధికారి సర్వేకు ఆదేశించడంతో మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, వీఆర్‌ఓ అంజయ్య, సర్వేయర్ వెంకట కృష్ణారెడ్డి, వీఆర్‌ఏలు, ఒంటిమిట్ట ఇన్‌చార్జ్ ఎస్ఐ మహమ్మద్ రఫీ, పోలీస్ ప్రొటెక్షన్‌తో వచ్చి ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేశారు. ఈ సర్వేలో 1509 సర్వే నెంబర్‌లోని 98 సెంట్లలో కొంత భాగం ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు ధృవీకరించారు. ఈ సర్వే జరుగుతుండగా 1509 సర్వే నెంబర్ పక్కనే ఉన్న 1512–1 సర్వే నెంబర్‌లోని తన ఎకరా 7.5 సెంట్ల భూమి వద్దకు వెళ్లేందుకు దారి చూపాలని రైతు రెవెన్యూ వారిని కోరారు. తన భూమి వద్దకు వెళ్లాలంటే తనకు మారెమ్మ ఆలయం వద్ద నుంచే వెళ్లాలని, కానీ ఆ ఆలయానికి సంబంధించిన గ్రామస్తులు దీనికి ఒప్పుకోలేదని, తాను వెళ్లకుండా కంచె వేశారన్నారు. తన భూమి వద్దకు వెళ్లేందుకు దారైనా చూపండి లేక తనను ఈ ఆలయం నుంచి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు రెవెన్యూ వారు మండల తహసీల్దార్ వద్దకు వచ్చి దారి చూపేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంకా ఆక్రమణకు గురైన 1509 సర్వేలోని కొంత భాగానికి సంబంధించిన వివరాలను మండల తహసీల్దార్ దామోదర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నట్లు సర్వేయర్ వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు



రాయచోటి జగదాంబసెంటర్ : ట్రిపుల్ ఐటీలలో ప్రవేశంపొందిన విద్యార్థులకు వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పట్టుదలతో చదువుకొని ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులు మన ప్రాంతానికి గర్వకారణమన్నారు. గ్రామీణ విద్యార్థులకు ప్రగతి మార్గం కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దూరదృష్టి ఫలమే ట్రిపుల్ ఐటీలన్నారు. వైఎస్‌ఆర్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దిక్సూచి అయిందన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల మార్కుల ఆధారంగా రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ట్రిపుల్ ఐటీ) 2025–26 విద్యా సంవత్సరంలో రాయచోటి నియోజకవర్గం నుండి ట్రిపుల్ ఐటీలకు అర్హత సాధించిన విద్యార్థులు ఎక్కువ మంది ఉండటం రాయచోటి ప్రాంత ప్రతిభకు నిదర్శనమన్నారు.

నారు కొనలు తుంచి నాటుకోవాలి

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె, వెలుగుపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించామని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జంగాలపల్లె గ్రామంలో జనుము పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులకు వివరించామన్నారు. ఎట్టి పరిస్థితిలో లూజు విత్తనాలను రైతులు కొనుగోలు చేయరాదన్నారు. జింక్ సల్ఫేట్, జిప్సం 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వరిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించామన్నారు. వరి నాట్లకు వారం రోజుల ముందు సెంటు విస్తీర్ణంలో 160 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవాలన్నారు. రసం పీల్చు పురుగు, ఉల్లికోడు, కాండం తొలుచు పురుగు నివారణ జరుగుతుందన్నారు. వరిలో కాలిబాటలు, నారు కొనలు తుంచి నాట్లు వేసుకోవాలన్నారు. గట్లు వెడల్పు పెంపు, జింక్, పొటాష్, నత్రజని సమతుల వాడకం వంటి అంశాలపై రైతులకు వివరించామన్నారు. 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్ పంపిణీ వంటి ప్రయోజనాలను వివరించినట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి, చెంచుగారిపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి మంజులారాణి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న భూములను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, కావున భూమి సారం పెంచే పద్ధతులైన పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసి భూమిలో కలియదున్నడం, పశువులు, మేకలు ఎరువు వేసుకోవాలన్నారు. అలాగే ఏపీఎంఐపీ తరపున ఎంఐ ఏఓ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పది ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు తొంబై శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు అందించబడునని, అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ అందించబడునని, వారు జీఎస్టీ 12 శాతం కట్టాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రభాకర్ రెడ్డి, జయలక్ష్మి, విలేజ్ హార్టికల్చర్ అధికారి ప్రియదర్శిని, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక







రాజంపేటటౌన్/పెనగలూరు/ఓబులవారిపల్లె/ నందలూరు : పది పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. వీరిలో రాజంపేట మండలంలోని బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గార్లపాటి ఫినిహాస్, ఎస్.అమీన్‌బాషా ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. పెనగలూరు మండలంలోని మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు కడప మోక్షిత, చౌడారపు సుధీర్, మారంరెడ్డి మోక్ష ప్రియ ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా, ఓబులవారిపల్లె మండలానికి చెందిన అలాగే ఓబులవారిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన బి.ప్రజేశ్వర్ రెడ్డి, ముక్కావారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సమృత, వైకోట ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.మల్లికార్జున రావు, ఎస్.సునీత, ఎ.హర్షితలు ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఓబులవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.జశ్విత ఎంపికయ్యారు. అలానే నందలూరు మండలంలోని పాటూరు జెడ్పీహెచ్ఎస్ నుంచి మణిదీప్, షణ్ముఖ శ్రీనివాస్‌లు, బీసీ గురుకులానికి చెందిన వెంకటశైలజ, ప్రణవిలు ఆర్కే వ్యాలీకి ఎంపిక కాగా కాశీ విశాలాక్షి నూజివీడుకు ఎంపికయ్యారు. విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల ఆయా మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోండి

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వీధి రోడ్డును సైతం ఆక్రమించి నిర్మిస్తున్న భవనాలను అడ్డుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు రాయచోటిలోని శ్రీరామనగర్ వాసులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మదనపల్లె రోడ్డు నుంచి శ్రీరామనగర్‌కు వెళ్లే 15 అడుగుల వీధి రోడ్డును ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నారన్నారు. గత రెండు నెలలుగా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డంగా భవనాన్ని నిర్మించవద్దని అడ్డువెళ్లిన మాపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దిక్కున్న చోటుకు వెళ్లి చెప్పుకోండి అంటూ నిర్మాణాన్ని చేపడుతున్న యజమాని తమపై చిందులు వేశాడన్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. సమస్య పరిష్కరించకుండా మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని శ్రీరామ్‌నగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలని విన్నవించారు.

ధర్నాకు అనుమతివ్వండి

సుండుపల్లె : వీఆర్‌ఏ సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ధర్నా చేసేందుకు అనుమతివ్వాలని మండల వీఆర్‌ఏలు తహసీల్దార్ మహబూబ్ చాంద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ధర్నా నిర్వహించనున్నట్లు వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో నాగరాజ, అల్లాబకాష్, రామచంద్ర, రమణ, రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.